క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం



తెనాలిఅర్బన్: పట్టణంలోని నాజర్‌పేటలో అనాధికారికంగా నిర్మించిన రెండు భవనాల పిల్లర్‌లను మున్సిపల్ అధికారులు మంగళవారం పగలకొట్టారు. నాజర్‌పేటలో మున్సిపల్ నిబంధనలకు వ్యతిరేకంగా ఇద్దరు బిల్డర్స్ నాలుగో అంతస్థు నిర్మాణానికి సంబంధించిన పిల్లర్స్ వేశారు. వాటిపై ఫిర్యాదులు రావడంతో టౌన్‌ప్లానింగ్ అధికారి సాంబశివరావు తన సిబ్బందితో అక్కడి వెళ్ళి వాటిని పగలకొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా, మూడు ఫ్లోర్‌లను నిర్మించుకునేందుకు మున్సిపాలిటీ అనుమతిస్తుందని తెలిపారు. అదనంగా ఫ్లోర్స్ నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లిపరలో కొండ చిలువ హతం



కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర గ్రామ శివారులో కొండ చిలవను గ్రామస్తులు హతమార్చారు. కృష్ణా నది కరకట్ట దిగువన భీమవరపు బ్రహ్మరెడ్డి చెందిన కోళ్ల ఫారం వద్ద కొండ చిలువ రాత్రి సమయంలో సంచరిస్తున్న విషయాన్ని అక్కడి పనిచేసేవారు గమనించారు. వారం రోజులుగా కోళ్ల ఫారంలో రాత్రి సమయంలో కోళ్ల మాయమవడం, రాత్రి సమయంలో కోళ్ల ఒక్కసారిగా అన్ని అరవటంతో కాపు కాశారు. పంట పొలంలో నుంచి భారీ కొండ చిలువ దగ్గరలో ఉన్న కరెంట్ స్తంభంపై నుంచి కోళ్ల ఫారం మొదటి అంతస్తులో ఉన్న వాటి వద్దకు వెళ్లడాన్ని వారంతా గమనించారు. వెంటనే దాన్ని ఒడిసిపట్టి చంపేశారు.

డిస్లెక్సీయా వ్యాధిని అధిగమించడం సులువే

ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతిబాబు



తెనాలిఅర్బన్: డిస్లెక్సీయా అనేది మానసిక సమస్య అని, దానిని అధిగమించడం పెద్ద కష్టమేమి కాదని తెనాలి మండల విద్యాధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబులు పేర్కొన్నారు. ప్రపంచ డిస్లెక్సీయా వారోత్సవాల సందర్భంగా కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ నుంచి మంగళవారం ఏర్పాటు చేసిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి లేకపోవడం, అక్షరాలు వరుస క్రమంలో రాయకపోవడం వంటివి డిస్లెక్సీయా లక్షణాలని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అలాంటి విద్యార్థులపై కొంత శ్రద్ధ చూపిస్తే దానిని పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. ప్రతి ఏటా అక్టోబర్ నెలలో దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం సుందరరావు, ఉపాధ్యాయులు సునీల్, సునీత, పలువురు సీఆర్ఎంటీలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యం చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి




కొల్లిపర: ప్రతి ఒక్కరూ వివిధ పనులు చేసే సమయంలో పని చేయక ముందు, పని చేసిన తరువాత నిత్యం సబ్బుతో చేతులు కడుకుంటూ పరిశుభ్రంగా ఉండాలని, అలా చేయటం వలన ప్రజలల్లో వచ్చే అతిసార వ్యాధిని 50శాతం పైగా నివారించవచ్చు అని ఎంపీడీవో వి.విజయలక్ష్మి సూచించారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లాపరిషత్‌ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు చేతుల పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన 30% శ్వాస సంబంధిత వ్యాధులు నివారించవచ్చు అని అన్నారు. అనంతరం ఏఎన్ఎంలు విద్యార్థులకు సబ్బుతో ఏవిధంగా శుభ్రంగా చేసుకోవాలన్న అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఝాన్సీలత, హెచ్ఎం డి.వెంకట్రావు, ఈవో పిఆర్డీ బార్గవ, పంచాయతీ కార్యదర్శి అలకనంద, ఎం.ఆర్‌సి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పేరుకే ఘనం - నిర్వహణ వ్యర్థం

నిలచిన మలఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ సేవలు

- రెండు నెలల క్రితం మొరాయించిన మోటర్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


తెనాలిలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో తొలిసారి తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మల ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ సేవలు నిలచిపోయాయి. రెండు నెలల నుంచి దీనిలో మోటర్ రిపేరు రావటంతో నిర్వహణను ఆపివేశారు. దీంతో పట్టణంలోని మల వ్యర్థాలను రోడ్ల ప్రక్కన పోస్తున్నారు. దీనివల్ల దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. తెనాలి పురపాలక సంఘ పరిధిలో 12 కమ్యూనిటీ టాయిలెట్స్ ఉన్నాయి. ఇవి కాకుండా పట్టణంలో 57 వేల నివాస గృహాలున్నాయి. పురపాలక సంఘ పరిధిలోని కమ్యూనిటీ టాయిలెట్స్‌లోని సెప్టిక్ ట్యాంక్‌లు రెండు నెలలకు నిండుతూ ఉంటాయి. పురపాలక సంఘ పరిధిలోని ట్యాంకర్‌తో వచ్చిన మల ఘన వ్యర్థాలను గతంలో శివారు ప్రాంతాల్లోని రోడ్లవెంట పోస్తుండే వారు. అలాగే సెప్టిక్ ట్యాంక్‌లను క్లీన్ చేసే ప్రవేట్ వాహనదారులు కూడా ఇదే విధంగా శివారు ప్రాంతాలలో వాటిని పోస్తు వచ్చారు. దీనివల్ల రోడ్లపై వెళ్లే వారికి దుర్వాసన రావటంతో పాటు ఇబ్బందులు ఏర్పడేవి.

రాష్ట్ర ప్రభుత్వం ఫీకల్ స్లజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ)లను ఏర్పాటు చేసుకోవాలని 2017లో సూచించింది. దీంతో అప్పటి పాలకులు, ప్రజాప్రతినిధులు తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో రూ.20 లక్షలు వెచ్చించి మలఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే ఇది తొలి ప్లాంట్ కావటంతో అప్పట్లో రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల అధికారులు, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు కన్సల్టెన్సీ ప్రతినిధులు తెనాలి వచ్చి దీనిని పరిశీలించి నిర్వాహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పట్టణంలో 10 సెప్టిక్ ట్యాంక్ వాహనాలు

తెనాలి పట్టణంలో సెప్టిక్ ట్యాంక్‌లను క్లీన్‌చేసే అయిదు ప్రవేట్ ఏజన్సీలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఏజన్సీలకు చెందిన 9 వాహనాలు, మున్సిపల్ పరిధిలోని ఒక వాహనం మలఘన వ్యర్థాలను సేకరిస్తుంటాయి. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాంట్ ద్వారా 28,000 లీటర్లను ప్రతిరోజు శుద్ధి చేసే అవకాశం ఉంది. ఒక్కో ట్యాంకర్ కేపాసిటీ మూడు వేల లీటర్లు... అంటే సుమారు 9 ట్యాంకర్ల మలఘన వ్యర్థాలను ప్లాంట్‌లో శుద్ధి చేసే అవకాశం ఉంది.

ప్లాంట్ పనిచేసే విధానం ఇది

ట్యాంకర్లతో తీసుకువచ్చిన మల వ్యర్థాలను ముందుగా ప్లాంట్ వద్ద ఉన్న ట్యాంక్‌లో పోస్తారు. దానిలోని యంత్రం దానిని శుద్ధి చేసి ఘన వ్యర్థాలను ఒక ట్యాంక్‌కు, శుద్ధి చేసిన నీటిని మరో ట్యాంక్‌కు పంపుతుంది. శుద్ధి చేసిన నీటిని పట్టణంలోని డివైడర్ల వద్ద ఏర్పాటు చేసిన మొక్కలకు, కంపోస్టు యార్డులోని మొక్కల నిర్వహణకు ఈ నీటినే ఉపయోగిస్తున్నారు. శుద్ధి చేసే సమయంలో వచ్చే అతితక్కువ ఘన వ్యర్థాన్ని కంపోస్టుగా మొక్కలకు ఉపయోగించుకుంటారు.

పాడైన రెండు మోటర్లు

ఎస్ఎఫ్‌టీపీ ప్లాంట్‌లో ఆరు మోటర్లు ఉంటాయి. వాటి ద్వారా మలఘన వ్యర్థాల నిర్వహణను చేస్తుంటారు. అయితే వాటిలో రెండు మోటార్లు రెండు నెలల క్రితం పాడైపోయాయి. అంతేకాకుండా ప్లాంట్‌లోని కొన్ని యంత్రాలకు రంధ్రాలు పడ్డాయి. దీంతో ప్లాంట్ నిర్వహణను నిలిపివేశారు. దీనివల్ల మున్సిపల్ కమ్యూనిటీ టాయిలెట్స్ నుంచి, ప్రవేట్ వాహనాల ద్వారా వచ్చే మల ఘన వ్యర్థాలను ప్రస్తుతం రోడ్లవెంట పోస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే మోటర్లుకు మరమ్మతులు చేయించటంతో పాటు యంత్రాలకు వెల్డింగ్ చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పాడైన మోటార్లు ఇవే

రెండు నెలల్లో మరమ్మతు చేస్తాం



ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌లో మోటార్లు పాడైన విషయం నా దృష్టికి వచ్చింది. దానిలో కొన్ని మరమ్మతులు చేయించాల్సి ఉంది. వీటి కోసం రూ.12.50 లక్షలు నిధులను వెచ్చించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రెండు నెలల్లో మరమ్మతులు చేయించి ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకువస్తాం.

–బండి శేషన్న, మున్సిపల్ కమిషనర్, తెనాలి

మహిళా మండలి భవనం అప్పగింత



తెనాలిఅర్బన్: కొత్తపేటలోని మహిళా మండలి భవనాన్ని మంగళవారం మున్సిపల్ అధికారులకు రెవెన్యూ అధికారులు అప్పగించారు. మహిళా మండలి నిర్వాహకులు డాక్టర్ కస్తూరి భాయ్ భవనాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రక్రియ పూర్తికావడంతో తెనాలి తహసీల్దార్ గోపాకృష్ణ దానికి సంబంధించిన పత్రాలను మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ బండి శేషన్నకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా మండలి భవనం పురపాలక సంఘ ఆధీనంలోకి వచ్చిందన్నారు. దీని నిర్వహణ, ఇతర కార్యక్రమాలు మున్సిపాలిటీ ద్వారాచేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ టీపీవో సాంబశివరావు, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వినాయకుడి గుడి వద్ద ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు పాల్గొని, మాట్లాడారు. పేద విద్యార్థుల కోసం మంత్రి నారా లోకేష్ సహకారంతో నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మొత్తం 180 విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

సచివాలయంలో కుప్పకూలిన సీలింగ్


కుప్పకూలిన హెవీ సీలింగ్ దెబ్బకు వంకర్లు తిరిగిన ఫ్యాను


పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్ సుజాత

- సిబ్బందికి తప్పిన పెనుప్రమాదం
- నాణ్యతా లోపమే కారణం
- టీడీపీ హయాంలో రూ.49 లక్షలతో నిర్మాణం
- అయిదేళ్లకే కూలిన సీలింగ్
- రాత్రివేళ కావటంతో సిబ్బంది సేఫ్

తెనాలి: పట్టణ 13వ వార్డు చినరావూరులో కమ్యూనిటీ హాలు పైఅంతస్తులో నిర్వహిస్తున్న సచివాలయం సీలింగ్ కుప్పకూలింది. సచివాలయ సిబ్బంది మంగళవారం ఉదయం విధులకని వచ్చి తాళాలు తీయటంతో లోపలున్న బీభత్స దృశ్యాన్ని చూసి హడలిపోయారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన హెవీ సీలింగ్ మొత్తం కుప్పకూలి ఉంది. రాత్రి వేళ కుప్పకూలి ఉంటుందనీ, అదే పగటిపూట జరిగినట్టయితే పెనుప్రమాదం జరిగి ఉండేది. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు సమాచారమిచ్చారు. నాణ్యతాలోపమే ఇందుకు ప్రధాన కారణమని వార్డు కౌన్సిలరు, స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

2017లో.. రూ.49 లక్షలతో నిర్మాణం!

13వ వార్డులోని కమ్యూనిటీ హాలుకు పైఅంతస్తు నిర్మాణాన్ని టీడీపీ హయాంలో చేపట్టారు. 2017లో రూ.49 లక్షల మున్సిపాలిటీ నిధులతో ఆరంభించిన నిర్మాణం పూర్తికావటానికి దాదాపు రెండేళ్లు పట్టింది. కమ్యూనిటీ హాలుపై గోడలు నిర్మించి, రేకులు బిగించి, సీలింగ్ చేశారు. 2019 జనవరిలో అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ ఛైర్మన్ పెండేల వెంకట్రావు, కమిషనర్ కంతమనేని శకుంతల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేశారు. ఆ తర్వాత కొద్దినెలలకే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. 2021లో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఆవిర్భవించాక, స్థానిక 13వ వార్డులో సచివాలయాన్ని అక్కడి రావిచెట్టు దగ్గర్లోని ఆయుర్వేదిక్ హాస్పటల్ వద్ద భవనంలో ఏర్పాటు చేశారు. పాత భవనం కావటంతో పెచ్చులూడటం, వర్షపునీరు లీకేజీ అవుతుండటంతో ఆ సచివాలయాన్ని అదే వార్డులోని కమ్యూనిటీ హాలు పైభాగంలో నిర్మించిన మొదటి అంతస్తులోకి మార్చారు. అదే పై అంతస్తులోని హెవీ సీలింగ్ ఇప్పుడు కుప్పకూలింది. ఫ్యాన్ల రెక్కలను విరిచేసుకుంటూ టేబుళ్లు, కంప్యూటర్లపై సీలింగ్ పడింది. సీలింగ్‌కు బిగించిన బోల్టులు కూడా ఎక్కడివి అక్కడే పైనే ఉండిపోయాయి. సీలింగ్ మాత్రమే మొత్తం కూలిపోయింది.


టేబుల్‌పై సీలింగ్ శకలాలు


కార్యాలయంలో కనిపిస్తున్న రేకులు

సచివాలయంలో మొత్తం తొమ్మిదిమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం పనివేళలు ముగిశాక యథావిధిగా తాళాలు వేసి వెళ్లిపోయారు. ఉదయాన్నే వచ్చి చూసేసరికి కనిపించిన దృశ్యాన్ని చూసి హడలిపోయారు. విధినిర్వహణలో ఉన్నపుడు జరిగివుంటే జరిగే ప్రమాదాన్ని తలచుకుని భీతిల్లారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి జరిగిన విషయాన్ని తెలియజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత సీలింగ్ కూలిన సచివాలయాన్ని సందర్శించారు. నాణ్యతా లోపంతోనే సీలింగ్ కుప్పకూలిందని కౌన్సిలరుతోపాటు స్థానికులు వెల్లడించారు.

ప్రభుత్వ మద్యం దుకాణాలు ఖాళీ

దగ్గరుండి ఖాళీ చేయించిన అధికారులు

తెనాలిరూరల్: ప్రభుత్వ మద్యం దుకాణాలను అధికారులు ఖాళీ చేయించి, సరుకును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న కొద్దిపాటి సరుకును ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. అర్ధరాత్రి వరకు ఈ తతంగం కొనసాగింది. ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న ప్రైవేటు భవనాల యజమానులతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్న ప్రైవేటు మద్యం దుకాణాల లబ్ధిదారులు, మంగళవారం మధ్యాహ్నానికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సరుకును బయట పెట్టించి, దుకాణాలను సిద్ధం చేసుకున్నారు. మరోవైపు వారం రోజులుగా ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరుకు వేయడం ఆపేశారు. అన్న సరుకునే విక్రయించాలని మద్యం దుకాణాల సిబ్బందికి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. బార్‌లలో అధిక ధరలు చెల్లించలేక మందుబాబు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అందుబాటులో ఉన్న బ్రాండ్‌లనే తప్పక కొనుగోలు చేయాల్సి వచ్చింది. పట్టణంలో ఏడు ప్రభుత్వ మద్యం దుకాణాలు, మూడు లిక్కర్ మాల్స్, మండలంలో ఐదు దుకాణాలు ఉండగా, ఖచ్చిత సమయపాలన పాటిస్తూ ఇన్నాళ్లు మద్యం విక్రయాలు జరిగాయి. ప్రస్తుతం పట్టణంలో 11, మండలంలో ఐదు షాపులు ఏర్పాటు కానున్నాయి.


మారిస్‌పేటలోని మద్యం దుకాణంలో సరుకును బయటపెట్టించిన అధికారులు


మూతబడిన బోస్‌రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణం

ఈ దుకాణాలు సమయపాలన పాటించే విధంగా ఎక్సైజ్, పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటారేమో వేచి చూడాల్సిందే.

అధికారుల సూచనలతో అధిక దిగుబడులు

లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం

తెనాలిరూరల్: వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని లాం ఫాం శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రత్నం తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం, బుర్రిపాలెం గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం పర్యటించారు. పొలాలను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నం మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్, జీవఎరువులు వాడాలని సూచించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతంల గురించి వివరించారు. క్షేత్ర సందర్శనకు వెళ్లి పొలాలను పరిశీలించగా చీడపీడలు, నాము తెగులు, సుడి దోమను గుర్తించి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. దోమ పోటుకు పైమెట్రోజైన్ 0.6 గ్రాములు, ట్రైఫ్లూమిజోపైరిన్ 0.486 ఎంఎల్, డైనోటిఫ్యైరాన్‌లలో ఏదైనా వాడవచ్చని సూచించారు.


రైతులకు సూచనలిస్తున్న డాక్టర్ రత్నం

మండల వ్యవసాయశాఖాధికారి జి. ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ఎర్ర నల్లి తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం పొడి లేదా కైకోఫాల్ 5ఎంఎల్, కానీ స్పైరోమెసిఫిన్ 1ఎంఎల్‌లలో ఏదైనా వాడవచ్చని తెలిపారు. ఈ కర్షక పంట నమోదు వివరాలు 16వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని చెప్పారు. వీఏఏలు నీలవేణి, గోపినాథ్, ఏఈవో జి. మోహనరావు, రైతులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోండి


మున్నంగిలో కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు


కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గంగాయాదవ్, పాములు

తెనాలిఅర్బన్: అబ్దుల్ కలాంను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని నవచైతన్య బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్ పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని మార్కెట్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిసైల్ మ్యాన్‌గా పేరొందిన ఆయన భారత అత్యున్నత పదవిని చేపట్టారని గుర్తుచేశారు. ఆయన అందించిన స్ఫూర్తితో అందరూ ముందుకు కొనసాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.భీష్మపాములు, తాడిబోయిన ప్రవీణ్‌కుమార్, నల్లగొర్ల గంగాదేవి, కావూరి శ్రీనివాసరావు, బుర్రా శ్రీను, మహ్మద్ కరిముల్లా, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


దార్శనికుడు, స్ఫూర్తి ప్రదాత

మున్నంగి(కొల్లిపర): భారత మాజీ రాష్ట్రపతి,భారతరత్న, క్షిపణి పితామహుడైన అబ్దుల్ కలాం విద్యార్థులకు, యువతకు గొప్ప దార్శనికుడు, మార్గదర్శి అని ప్రధానోపాధ్యాయుడు రాము అన్నారు. మండలంలోని మున్నంగి గ్రామంలోని మండల పరిషత్‌ప్రాథమిక పాఠశాల(ఆర్)లో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు సోమరౌతు లక్ష్మీ కమల మాట్లాడుతూ స్వయం కృషి, స్వీయ ప్రతిభతో సామాన్యుడు, అసామాన్యుడు కాగలడని కలాం తన జీవితంలో నిరూపించారన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు జాబితా సిద్ధం

తాడికొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల ఎన్నికలకు జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ కె.నాసరయ్య సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో వీఆర్వోల సమావేశం నిర్వహించారు. మండలంలో 8 సాగునీటి సంఘాలున్నాయని, వాటి పరిధిలోని రైతుల జాబితాను ఇరిగేషన్ అధికారుల సహకారంతో సిద్ధం చేయాలని చెప్పారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపై గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను వెంటనే పరిష్కారం చేయాలన్నారు. మద్యం దుకాణాల గడువు ముగియడంతో నేడు ఎక్సైజ్ అధికారుల సమక్షంలో వీఆర్వోలు పంచనామా నిర్వహించి సరుకును అప్పగించాలని సూచించారు.

వరాహ.. విహారం



వర్షాకాలం... ఏమరుపాటుగా ఉంటే వ్యాధులు వచ్చేస్తాయి! అసలే వర్షాలకు తోడు రోడ్లవెంట చెత్తాచెదారం, వరాహ సంచారం, దుర్గంధంతో రోడ్డువెంట వెళ్లే ప్రజలు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి స్థానిక ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ప్రధాన పోస్టాఫీసు నుంచి బోసురోడ్డుకు దారితీసే రోడ్డులో కనిపించింది.

– తెనాలి

ఇసుక తరలిస్తున్న ఇద్దరిని పోలీసులకు అప్పగింత

తాడికొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన తుళ్లూరు మండలం లింగాయపాలెం ఎన్‌సీసీ కంపెనీలో జరిగింది. వివరాల మేరకు.. ఆదివారం ఉదయం ఎన్‌సీసీ నిర్మాణ కంపెనీ నిల్వ చేసుకున్న ఇసుకను అక్రమంగా ఇద్దరు తరలిస్తుండగా.. కంపెనీ సిబ్బంది వారిని పట్టుకున్నారు. పెదకూరపాడు, అమరావతి మండలాలకు చెందిన శివకృష్ణ, వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదు.

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం



మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హై స్కూల్‌లో మంగళవారం బాలికల ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హైకోర్టు సీనియర్ కౌన్సిల్ పోసాని వెంకటేశ్వరరావు పాల్గొని, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఎన్‌సీసీ వల్ల క్రమశిక్షణతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ తమ పాఠశాలకు ఎన్‌సీసీ యూనిట్ కేటాయించినందుకు కమాండింగ్ అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్డ్ మేజర్ సి.రామ్మోహన్‌రావు, అశోకా రాణి జయకుమార్, ప్రధానోపాధ్యాయురాలు జె సుకన్య, పీడీ షేక్ రన్ను హుస్సేన్ పాల్గొన్నారు.